# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

సోమవారం 20, అక్టోబర్ 2025






# రైల్వే గేటుతో తప్పని తిప్పలు

★ ఫ్లైఓవర్ నిర్మించాలని కోరుతున్న ప్రజలు

రెబ్బెన, ప్రభాతవార్త

మండల కేంద్రంలోని గంగాపూర్ రైల్వే గేటుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైల్వే గేటుతో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుంది. సిహెచ్‌పి నుండి నిత్యం బొగ్గు సరఫరా కానుండటంతో ప్రతిసారి గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుంది అని ప్రజలు అంటున్నారు. ఈ రైల్వే గేటు మార్గం ఉండి గంగాపూర్, పాసిగాం, లక్ష్మీపూర్, మా ద్వై గూడెం, నంబాల, నారాయణపూర్, జక్కులపల్లి, అయ్యగారిపల్లి, పోతేపల్లి, రాజారాం, సింగిల్ గూడెం తదితర గ్రామ ప్రజలు రాకపోకలు కొనసాగిస్తూ ఉంటారు. ఏదైనా మెడికల్ అత్యవసర పరిస్థితులు ఉంటే అంతే సంగతులు. ఇకనైనా సంబంధిత ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి ఫ్లైఓవర్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.





# గంజాయి సాగుపై పోలీసుల ఉక్కుపాదం

✤ దడ పుట్టిస్తున్న మాదకద్రవ్యాల దందా... ✤ డ్రోన్ల సహాయంతో గంజాయి మొక్కల పట్టివేత

ఆసిఫాబాద్, ప్రభాతవార్త

కుమురంభీమ్ జిల్లా వ్యాప్తంగా గత కొంతకాలంగా మాదకద్రవ్యాల దందా దడపుట్టిస్తోంది. పదుల సంఖ్యలో గంజాయి మొక్కలు పట్టుబడుతున్నాయి. కొంత కాలంగా జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే రైతులకు అవగహన రహిత్యంతోనే గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు కనబడుతోంది. జిల్లాలోని ఏజెన్సీ మండలాల్లో మారుమూల గ్రామాలను లక్ష్యంగా చేసుకొని అమాయక రైతులకు డబ్బులు ఆశ చూపి వెనుకుండి కొంతమంది దళారులు అంతర పంటగా గంజాయి మొక్కల పెంపకానికి ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తోంది. కుమురం భీం జిల్లాలో ఏజెన్సీ మండలాలైన జైనూరు, కెరమెరి, సిర్పూరు (యు), వాంకిడి, లింగాపూర్‌లోని తండాల్లో పత్తి పంటల మధ్యలో ఎవరికీ అనుమానం రాకుండా దందా కొనసాగిస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా వివిధ ప్రాంతాల్లో కొందరు దళారులు ముఠాగా ఏర్పడి గంజాయిని సులువుగా సరఫరా చేస్తున్నారు. గంజాయి రహిత జిల్లా లక్ష్యంగా జిల్లా పోలీసులు చర్యలు చేపడుతోంది. జిల్లాలో నిషేధిత మత్తు పదార్థాల నివారణపై పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగానే కొన్ని నెలల్లో పట్టుబడ్డ గంజాయి కేసులు అనేకం వెలుగుచూస్తున్నాయి. ఇప్పటి వరకు 53 గంజాయి కేసులు, 508 గంజాయి మొక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి సాగు, రవాణా, అమ్మకం నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఏఎస్పీ చిత్తరంజన్ హెచ్చరించిన నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక నిఘా, సెర్చ్ ఆపరేషన్లు చేపట్టారు. ఈ మధ్య కాలంలో పోలీసులు డ్రోన్లు ఉపయోగించి గంజాయి మొక్కల పెంపకలాను గుర్తించి పట్టుకుంటున్నారు. అక్రమ కార్యకలాపాల్లో పాల్గొనేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, గంజాయి వంటి మాదకద్రవ్యాల గురించి ఎవరైనా సమాచారం తెలిసినా వెంటనే డయల్ 100, 8712670551, స్థానిక పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్పీ స్పష్టం చేశారు.



















# దర్జాగా దందా.. తరలుతున్న ఇసుక

✧ ఇసుకాసురులకు కాసుల పంట ✧ నిబంధనలకు నీరుగారుస్తూ యధేచ్ఛగా అక్రమ ఇసుక రవాణా

✧ రేయింబవళ్లు తేడా లేకుండా నిరంతరంగా కొనసాగుతున్న దందా ✧ అమలు కాని వాల్టా చట్టం 2002

రెబ్బెన, ప్రభాతవార్త

జిల్లాలోని నీటి వనరులు ఇసుకసురులకు కాసుల పంటగా మారింది. పలు వాగుల నుండి అక్రమంగా రేయింబవలళ్లు అక్రమంగా ఇసుకను తోడేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా జిల్లాల సరిహద్దులను సైతం దాటిస్తున్నారు. నిర్మానుష్య ప్రాంతాలలో ఇసుకను పగటిపూట కుప్పలు వేసుకుని రాత్రి వేళలో లారీల ద్వారా తరలిస్తున్నారు. సెలవు దినం వస్తే చాలు రవాణా ఇంకా జోరుగా ఉంటుంది. కాగజ్ నగర్ పెద్దవాగు నుండి నల్ల ఇసుకను విచ్చలవిడిగా తవ్వి సిమెంట్ ఇటుక తయారీదారులకు విక్రయిస్తున్నారు. నిత్యం ఈ వాగు నుండి నుండి పదుల సంఖ్యలో ట్రాక్టర్లు నిరంతరంగా రవాణా చేస్తూనే ఉంటాయి. ఇది అదునుగా కాగజ్నగర్ ఎక్స్ రోడ్ వద్ద విచ్చలవిడిగా ఇటుక తయారీ కేంద్రాలు వెల్లు విరిసాయి. జిల్లా నుండి ప్రధానంగా తుంపల్లి ,అందవెల్లి, పులి కుంట, లక్షీ మ్రపూర్, గంగాపూర్, ఆసిఫాబాద్ పెద్దవాగు తదితర ప్రాంతాల నుండి నిత్యం ఇసుక అక్రమ రవణకు గురవుతుంది. పట్టించుకోవాల్సిన మైనింగ్ శాఖ అధికారులు, టాస్క్ ఫోర్స్, రెవెన్యూ శాఖ చూసి చూడనట్లు వ్యవహరిస్తూ ఉండటంతో ఇసుకసురులకు మూడు పువ్వులు ఆరు కాయలుగా దందా కొనసాగుతుంది. అడపాదడపా ఇసుక ట్రాక్టర్ దొరికితే 5000 జరిమానా వేసి సరిపెడుతున్నారు. ఇటీవల వర్షాలు తగ్గడంతో ఇసుక మెటలు విచ్చలవిడిగా వేయడం వల్ల ఇసుకసురులకు కాసుల పంట కురిపిస్తుంది.





### అమలు కాని వాల్టా చట్టం 2002....

ఈ చట్టం ప్రధాన లక్ష్యం నీటి వనరులు, భూమిని పరిరక్షించడం, భూగర్భ, ఉపరితల జలాల దోపిడిని నియంత్రించడం. చెట్ల కవచని ప్రోత్సహించడం, చెట్ల నకివేతను నిరోధించడం. ఈ చట్టం ప్రధాన లక్ష్యం. ఈ చట్టం అమలుకు రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామస్థాయిలలో అమలుకు సంబంధిత అధికారులు ఉంటారు. ఈ చట్టాన్ని తూట్లు వేస్తూ నిబంధనకు నీరు కారుస్తూ ఇసుకసురులు అక్రమంగా వ్యవహరిస్తున్నారు. చట్టాన్ని అమలు చేయవలసిన అధికారులు నిద్ర వస్తలో ఉంటున్నారు. ఇది ఇలాగే కొనసాగితే సహజ వనరులు అడుగంటుకు పోతాయి. భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారనుంది అని స్థానికులు అంటున్నారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ చట్టం బలోపేతం చేయడానికి కృషి చేస్తుంది.

---

### కనీస సౌకర్యాలకు నోచుకోని

# గిరి గ్రామాలు

బెజ్జూర్, ప్రభాతవార్త

బెజ్జూర్ మండలంలోని కుశ్నపల్లి గ్రామం నుండి సోమిని వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో ఉన్న రెండు ఒర్రెలపై వంతెనలు లేక సుస్మీర్, సోమిని, గెర్రెగూడ, మొగ వెల్లి, ఇప్పలగూడ,బండలగూడ, చింతలపల్లి, పాత సోమిని తదితర గ్రామాల ప్రజలు వర్షాకాలం వచ్చిందంటే నరకయాతన అనుభవిస్తున్నారు. బాలింతలు సైతం ప్రసవ వేదనతో వర్షాకాలంలో ఇబ్బందులు పడ్డ ఘటనలు ఎన్నో ఉన్నాయి. భారతదేశానికి స్వాతంత్రం సిద్ధించి 78 వసంతాలు పూర్తయినప్పటికీ నేటికి కూడా మండలంలోని గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం మరియు వాగులు, ఒర్రెలపై వంతెనలు పూర్తి కాలేదు. ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెడుతున్నామని చెప్పుకునే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వాధినేతలు కనీస సౌకర్యాలకు కూడా నోచుకోని గిరిజన గ్రామాల వైపు దృష్టి సారించి తమకు కావలసిన రోడ్లు మరియు వంతెనలు నిర్మించి తమ బాధలను తీర్చాలని గిరిజన గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.



---

# మత్తులో గ్రామీణ యువత...
# శాంతి భద్రతలకు భంగం

జైపూర్, ప్రభాతవార్త

**గ్రామాలలో ఏరులై పారైతున్న మధ్యానికి, గంజాయి మత్తు తొడవడంతో గ్రామీణ యువత మత్తులో పడి జీవితాన్ని అంధకారం చేసుకుంటున్నారు. మండలంలోని గ్రామాల్లో బెల్ట్ దందా జోరుగా కొనసాగుతుందడం ప్రధాన కారణం అవుతుందనడంలో సందేహం లేదు. జైపూర్, ఇందారం గ్రామాల్లో ప్రభుత్వ అనుమతులు పొందిన మద్యం దుకాణాలలో ఉదయం 10 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు విక్రయాలు జరుపుతుండగా, బెల్ట్ దుకాణాల్లో యదేచ్ఛగా 24 గంటల అమ్మకాలు జరుపుతూ మందు బాబులను నిలువు దోపిడీ చేస్తూ అక్రమంగా అర్జీస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.**

ప్రభుత్వం కల్తీ మధ్యాన్ని అరికట్టే ప్రయాణంలో భాగంగా జైపూర్ మండలంలోని గ్రామాల్లో నాటు సారా (గుడుంబా) తయారీ దారులు, విక్రయదారుల పై కేసులు నమోదు చెసి, బైండొవర్ చెసి, గుడుంబా ను అరి కట్టడం లో విజయం సాధించిన అబ్కారీ శాఖ విజయం సాధించిందనడం సందేహం లేదు.ప్రభుత్వం మద్యం షాపులకు ఇచ్చిన టార్గెట్‌లను రీచ్ కావడంలో బెల్ట్ షాప్‌లు ప్రధాన పాత్ర పోషిస్తుండగా, సంబంధిత అధికారులు బెల్ట్ దందాకు సహకరిస్తూ కాసుల పంట పండించుకుంటున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు.



### పల్లెలో ప్రతి కిరాణా షాపు.. బెల్ట్ షాపే.....

ఒకప్పుడు పల్లె ప్రజలకు నిత్యవసర సరుకులను కోమట్లు మాత్రమే అమ్మేవారు, మారుతున్న కాలనికి అనుగుణంగా కుల, మత బేధం లేకుండా అన్నీ వర్గాల వారు కిరాణా వ్యాపారం సాగిస్తున్నారు. నిత్యావసర సరుకులతో పాటు మందు బాబులకు నేడు మద్యపానా సేవనం సైతం నిత్య కృత్యంగా మారింది. దీనిని ఆసరా చేసుకున్న కిరాణా దుకాణ దారులు నిత్యవసర సరుకుల కన్నా మద్యం విక్రయాలు అధికంగా అధిక ధరలకు అమ్ముతు సొమ్ము చేసుకుంటున్నారు. సంబదిత అధికారులు మామూలుగా తీసుకుంటూ యువత మత్తులో జోగడానికి ప్రధాన కారణం అవుతున్నారు. ఇటీవల పోలీస్ స్టేషన్‌లో ఓ గ్రామం రెండు కేసులు నమోదు కాగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మద్యం, మత్తు కారణంగా ఘటలు చోటు చేసుకున్నాయని పోలీసులు పేర్కొంటున్నారు. గ్రామస్తులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించే ప్రయత్నంలో పోలీసులు నిమగ్నం అయ్యారు.

### గ్రామాలకు పట్టిన బెల్ట్ మత్తు వదలక పోతే....

జైపూర్ మండలంలో గ్రామాలకు పట్టిన బెల్ట్ మత్తు వదలక పోతే యువత భవిష్యత్ నిర్వీర్యం అయ్యే అవకాశం ఉంది. తల్లిదండ్రులు, ఎన్నో ఆశలు పెట్టుకొని పిల్లలను సాకుతుంటే, మధ్య ప్రవాహం కాటేస్తోంది. బెల్ట్ షాపులను అరికట్టి యువతను సన్మార్గం నడిపించాల్సిన బాధ్యత,అటు పోలీసుల పై, ప్రభుత్వం ఎంతో ఉంది.

# అడుగడుగునా గుంతలే..!

○ చోద్యంగా చూస్తున్న అధికారులు.. ○ వేమనపల్లి మండల కేంద్రం నుంచి నియోజకవర్గానికి వెళ్లే రోడ్డు దుస్థితి



**వేమనపల్లి, ప్రభాతవార్త**

ప్రయాణం ప్రమాదపుటంచుల్లో కొనసాగిస్తున్నారు. వేమనపల్లి మండల కేంద్రం నుంచి నియోజకవర్గానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. నియోజకవర్గానికి వెళ్లే రోడ్డు అడుగడుగునా గుంతలమయమైంది. సుమారుగా ఆరు,ఏడు ఏళ్ల నుంచి మరమ్మత్తు పనులు చేపట్టేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవడం లేదు. వేమనపల్లి నుంచి బెల్లంపల్లికి వెళ్లాలంటే ప్రయాణికులు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్తున్నారు. ఇకనైనా పాలకులు దృష్టిసారించి మరమ్మత్తులు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వాలు వేల కోట్లు రూపాయలు ఖర్చుపెట్టి రహదారులు నిర్మాణం చేపడుతుంటే వేమనపల్లి మండలంలో మాత్రం అందుకు భిన్నంగా రహదారులు పునర్నిర్మాణానికి మోక్షం కలగడం లేదు. వేమనపల్లి మండల కేంద్రం నుండి నియోజకవర్గానికి వెళ్లే ప్రయాణ రహదారి అడుగడుగున గుంతలు ప్రమాదకరంగా మారి ఆరు ఏళ్ళు గడుస్తున్న నేటికీ మరమ్మత్తులు చేపట్టేందుకు అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు.వేమనపల్లి నుండి బెల్లంపల్లికి వెళ్లాలంటే ప్రయాణికులు తమ ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకొని ప్రమాదకరంగా మారిన రహదారుల పైన తప్పని పరిస్థితుల్లో ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు.

## తొమ్మిదేళ్ళ క్రితం రోడ్డు నిర్మాణం..

వేమనపల్లి మండల కేంద్రం నుండి బెల్లంపల్లి నియోజకవర్గానికి వెళ్లేందుకు కనీసం బీటి రోడ్డు లేకపోవడంతో ప్రజలు ఆవస్తులు పడుతున్నారు.45 కిలోమీటర్ల దూరంలో ఉన్న బెల్లంపల్లి పట్టణానికి సరైన రోడ్డు లేక ఆర్టీసీ బస్సులు కూడా రావడం లేదు. ప్రజల రవాణా సౌకర్యం కల్పించేందుకు 2014లో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో బుయ్యారం నుంచి వేమనపల్లి వరకు 18 కిలోమీటర్ల వరకు బీటి రోడ్డు మంజూరై పనులు పూర్తయినప్పటికీ నాగారం నుంచి మంగనపల్లి వరకు సుమారుగా నాలుగున్నర కిలోమీటర్ల రోడ్డుకు అటవీ అనుమతులు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. అదేవిధంగా బుయ్యారం నుండి ఆనందపూర్ ఎక్స్ రోడ్డు వరకు వర్షాలు పడినప్పుడల్ల రోడ్డు అంతా బురద మయంగా మారి వాహనాలు వెళ్ళలేని పరిస్థితి నెలకొంటుంది. మండల కేంద్రానికి జిల్లెడ, జక్కపల్లి,నాగారం, సూరారం లక్ష్మీపూర్, బద్దంపల్లి, బమ్మెన గ్రామాల ప్రజలు వెళ్లడానికి ఇబ్బంది పడతారు.బెల్లంపల్లి నియోజక వర్గం నుండి వేమనపల్లి మీదగా చెన్నూరుకు వెళ్లే ఆర్టీసీ రింగు బస్సు రహదారి



అధ్వానంగా ఉండటంతో ఆర్టీసీ బస్సు సేవలు రద్దు చేశారు.

## అటవీశాఖ అనుమతులు వస్తే తప్పా సమస్య తీరదు..

నాగారం రోడ్డుకు అటవీ శాఖ అనుమతి అడ్డంకిగా మారింది. ఆర్ అండ్ బి పరిధిలో ఉన్న నిర్మాణ పనులు చేసేందుకు అటవీ శాఖ అనుమతులు ఇవ్వడం లేదు. గత బిఆర్ఎస్ హయాంలో కొమురంభీం జిల్లా చిన్నరస్పల్లి నుంచి నాగారం, వేమనపల్లి వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. మరోసారి వేమనపల్లి నుంచి ముత్తాపూర్ వరకు ఆర్అండ్ బి నిధులు మంజూరైన అటవీశాఖ అడ్డంకితో పనులు ముందుకు సాగటంలేదు. ఈ రోడ్డుకు అటవీశాఖతోపాటు టైగర్ రిజర్వు ఫారెస్ట్ కింద గుర్తించడంతో సమస్య మరింత జఠిలంగా మారింది. రోడ్డు నిర్మించాలంటే టైగర్ కన్జర్వేటర్, అథారిటీ, అటవీ పర్యావరణ అనుమతులు తప్పనిసరిగా మారింది.

## ఎమ్మెల్యేపైనే ఆశలు..

**- కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు ముల్కల్ల సత్యనారాయణ**

బెల్లంపల్లి ఎమ్మెల్యేగా గెలిచిన గడ్డం వినోద్ ఎన్నికల్లో నాగారం రోడ్డు నిర్మిస్తామని హామీ కూడా ఇచ్చారు.ఆర్అండ్ బి అటవీ శాఖ అధికారులతో చర్చించి అటవీశాఖ అనుమతుల కోసం నివేదిక పంపించారు. ఈ రోడ్డు నిర్మాణానికి త్వరలో అనుమతులు రానున్నట్లు తెలుపుతున్నారు. ఈ రోడ్డు గుండానే నియోజకవర్గ కేంద్రానికి పక్కన ఉన్న కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా గ్రామాలకు నిత్యం రాకపోకలు ఉంటాయి. ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ చూపి అటవీ అనుమతులు లైన్ క్లియర్ చేసి త్వరలోనే నాగారం అటవీ మార్గంలో రోడ్డు పనులు చేపట్టేలా కార్యచరణ చేస్తున్నారు.

# అభివృద్ధికి ఆమడ దూరంలో బోథ్..

## అభివృద్ధికి రాజకీయ ముసుగు




**బోథ్, ప్రభాతవార్త**

మండలంలోని జనాభా 12582, 17 వార్డులు, 21 గ్రామపంచాయతీ గల బోథ్ మండలం జిల్లాలోని అతిపెద్ద నియోజకవర్గం కానీ ఈ మండలం ఎలాంటి అభివృద్ధి కాని దిశలో ఉండిపోయింది . ఇక్కడి రాజకీయాలు గల్లీలో కాకుండా ఢిల్లీ వరకు తమ చత్త చాటే రాజకీయాలు ఉన్నాయని గొప్పలు చెప్పుకునే నాయకులు వేరే మండలనికి తరలిపోయిన ప్రభుత్వ కార్యాలయలను తీసుకురావడంలో విఫలమయ్యారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అగ్నిమాపక కేంద్రం, మినీ స్టేడియం, ఇలాంటివి ఎన్నో ,రాజకీయ నాయకులు మారుతున్నారే తప్ప కార్యాలయాలు వచ్చింది లేదు. బోథ్ మండలాన్ని రెవెన్యూ డివిజన్ గా ప్రకటించాలని మండల వాస్తవ్యులు టెంట్లు వేసుకొని మరి సమ్మెలు చేపట్టారు. ఎలక్షన్ల సమయంలో కాంగ్రెస్ సభకు హాజరైన నాయకుడు బోథ్ మండలాన్ని రెవెన్యూ డివిజన్గా ప్రకటిస్తానని మాటివ్వడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్న ఇప్పటివరకు రెవెన్యూ డివిజన్ ఊసే లేదని మండల వాసులు వాపోతున్న. ఇప్పుడున్న బోథ్ సివిల్ కోర్టు ను వేరే మండలానికి తరలించే ప్రయత్నాలు చేశారు. కానీ స్థానిక న్యాయవాదులు, నాయకుల ప్రోత్సాహంతో నూతన భవనాన్ని నిర్మిస్తున్నారు. 28 కోట్లు వంద పడకల సి.హెచ్.సి ఆసుపత్రి 2023లో నూతన భవన నిర్మాణం చేపట్టారు. 2024లో నిర్మాణం పూర్తి చేసి పరికరాలతో సహా అప్పజెప్పే సమయం పూర్తయిన కాంట్రాక్టర్ బిల్లులు రాక మధ్యలోనే ఆగిపోయింది. ఆయా పార్టీల నాయకులు వాట్సాప్ గ్రూపుల్లో వారి పార్టీలకు సంబంధించిన గొప్పలు చెప్పుకుంటూ పరస్పర విమర్శలు చేసుకుంటున్నారే తప్ప అభివృద్ధి పాట్ల చిత్తశుద్ధి చూపడం లేదంటున్న పట్టణ వాసులు. మెరుగైన వైద్యం కోసం మొదలైన ప్రభుత్వ ఆసుపత్రి చుట్టూ తిరుగుతూ గంటల తరబడి తిష్ట వేస్తూ కొందరు వైద్యులను సైతం ప్రకటనల కోసం వేధించడం అది కాస్త స్టేషన్ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడం జరిగిందని ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఏది ఏమైనా మండలం చుట్టూ అలుముకున్న చీకటి తెరల నుండి బయటకు వచ్చి బోథ్ మండలాన్ని అభివృద్ధి పరిచే దిశగా కొనసాగాలి.

# సారూ..! వంతెన పనులు పూర్తి చేయండి

*** పిల్లర్ దశలోనే ఆగిపోయిన వంతెన నిర్మాణ పనులు * వర్షాకాలంలో నాటు పడవలే దిక్కు**



**ఆసిఫాబాద్, ప్రభాతవార్త**

కుమురం భీం జిల్లా కేంద్రానికి కుతవేటు దూరంలోని గుండి గ్రామంలో వంతెన లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీ ఏడాది వర్షాకాలంలో వాగు ఉప్పొంగినప్పుడల్లా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని నడుచుకుంటూ ప్రజలు వాగు దాటుతున్నారు. వాగు దాటాడానికి తాత్కాలికంగా వంతెన నిర్మించుకున్నా నీటి ప్రవాహం దాటికి ఆ వంతెన కొట్టుకొని పోతోంది. పూర్తిగా స్థాయిలో వంతెన నిర్మాణం కోసం 2006లో శంకుస్థాపన చేయగా, పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ పనులను పిల్లర్ దశ వరకు చేసి నిలిపివేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరిస్తామని, వంతెన నిర్మాణం పూర్తయ్యే వరకు ఓటు వేయమని గ్రామస్తులు తీర్మానం చేసుకొని కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. కానీ వివిధ పార్టీల నాయకులు హామీ ఇవ్వడంతో ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీనితో తిరిగి గత జనవరిలో పనులు ప్రారంభించినా నత్తనడకన కొనసాగినా ప్రస్తుతం పనులు నిలిచిపోయాయి.

## వంతెన లేక అదనంగా 30 కిలోమీటర్లు ప్రయాణం...

ఆసిఫాబాద్ మండల కేంద్రానికి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుండి గ్రామానికి వంతెన లేకపోవడంతో అదనంగా 30 కిలోమీటర్లు తిరిగి జిల్లా కేంద్రానికి చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుండి గ్రామానికి వెళ్లే వాగుపై వంతెన నిర్మాణం పనులు అసంపూర్తిగా ఉండడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రానికి చేరుకోవాలంటే దుబ్బాగూడ, కోమటిగూడ నుంచి తిరిగి రావాల్సిన పరిస్థితి ఉందని, అత్యవసర పరిస్థితిలో కనీసం 108 వాహనం కూడా రాక అనేక అవస్థలు పడుతున్నారు.

దీనితో ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని నాటు పడవల్లో వాగును దాటుతున్నారు. వర్షాకాలంలో రైతులు ఎరువులు, విత్తనాలు, ఇతర పనులకు తప్పనిసరిగా జిల్లా కేంద్రానికి రావాలిసిందే. ఆ సమయంలో వాగులు ఉప్పొంగితే రైతులతో పాటు పాఠశాల, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. 2006లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం వంతెన నిర్మాణానికి రూ. 3.60 లక్షలు మంజూరు చేయగా శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. పిల్లర్ దశ వరకు పనులు చేసి వదిలేశారు. రీటెండరింగ్లో భాగంగా వంతెన నిర్మాణ పనుల కోసం మరో రూ.3.25 కోట్లతో టెండర్ కూడా పూర్తయ్యింది. కానీ పనులు మాత్రం నెమ్మదిగా జరుగుతుండడంతో గ్రామస్తులకు తిప్పలు తప్పడం లేదు.

## ఇదే తరహాలో మరిన్ని వంతెనలు.......

మండలంలోని అప్పపల్లి వాగుపై ఏప్రిల్లో రూ.1.86 లక్షలతో వంతెన పనులు ప్రారంభిం చారు. కానీ ఈ పనులు పూర్తయ్యేలా కనిపించడం లేదు. ఇక్కడ సైతం వంతెన లేక పోవడంతో అప్పపల్లి, ఆర్ఆర్ కాలనీ ప్రజలకు ఇబ్బందులు తప్పేలా లేవు. అప్పపల్లి వాగుపై నిర్మిస్తున్న వంతెన పనుల్లో వేగం పెంచాలని,మళ్ళీ వర్షాకాలం మొదలైతే రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని, సంబంధిత అధికారులు వంతెన నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు. తుంపల్లి, అంకుసాపూర్ గ్రామానికి వెళ్లే దారిలోని వాగుపై లోలెవల్ వంతెనతో వరదలు వచ్చినప్పుడు పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి.












# పొంచి ఉన్న ప్రమాదం

**మామడ, ప్రభాతవార్త**

మండలంలోని దిమ్మదుర్తి నుండి నాల్దుర్తి వెళ్లే మార్గం గుండా వర్షాలకు రహదారి విరిగి పోవడం జరిగింది. ఈ దారి గుండా వెళ్లే ప్రయాణికులు ఇబ్బందికి గురి అవుతున్నారు. రాత్రి వేళలో ప్రయాణించాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తుంది. ద్విచక్ర వాహనాలు ఎక్కడ అదుపుతప్పి పడిపోతాయో అని ప్రమాదకరంగా ప్రయాణం కొనసాగించాల్సి వస్తుంది. ఇకనైనా సంబంధిత అధికారులు గుర్తుంచి మార్మతులు చేయాలనీ ప్రయాణికులు, గ్రామస్తులు కోరుతున్నారు.



# అధ్వాన్నంగా రోడ్లు..!

- అధిక వర్షాలతో గుంతలు పడ్డ రోడ్లు
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- మరమ్మతులు లేక ధ్వంసం పట్టించుకోని అధికారులు

**దహెగాం, ప్రభాతవార్త**

మండల కేంద్రం నుండి ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే రోడ్లు అన్ని అద్వానంగా మారాయి. ఇతర ప్రాంతాల ఇతర ప్రాంతాల వాహనదారులు మండల కేంద్రానికి రావడానికి వెనుకాడుతున్నారు. మండల కేంద్రం నుండి కాగజ్ నగర్ 30 కిలోమీటర్లు ఉంది.మండల కేంద్రం నుండి కొత్మీర్ వరకు సింగిల్ రోడ్డు ఉంది. కొత్మీర్ గ్రామం నుండి కాగజ్ నగర్ వరకు డబుల్ రోడ్డు ఉంది.కొత్మీర్ నుండి దహెగాం వరకు డబుల్ రోడ్డు కొరకు ఆర్ అండ్ బి శాఖ నుండి దాదాపు 30కోట్లు మంజూరయ్యాయి.పనులు దక్కించుకున్న





*ఈ గుంతల రోడ్డు దహెగాం నుంచి లగ్గం గ్రామం మీదుగా పెంచికాలపేట్ మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి ఈ రోడ్డు చెడిపోయి చాలా కాలం అవుతున్న మరమ్మత్తులు చేపట్టకపోవడంతో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి.మండల కేంద్రం నుండి లగ్గం ఎక్స్ రోడ్డు నాలుగు కిలోమీటర్ల వరకు గుంతలు ఏర్పడ్డాయి.ఈ రోడ్డు గుండ నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు గుంటలు ఏర్పడి అందులు నీరు నీరునిలవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాని వాహనదారులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.*

కాంట్రాక్టర్ కేవలం కల్వర్టులు నిర్మించి రోడ్డు పనులను నిలిపివేశారు.దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మండల కేంద్రం నుండి లగ్గం గ్రామం మీదుగా పెంచికల్ పేట వెళ్లాలన్న అ రోడ్డు సైతం ఆధ్వనంగా మారింది.బెల్లంపల్లి, మంచిర్యాల కు వెళ్లాలన్న నల్ల చెరువు వద్ద రోడ్డు అద్వానంగా మారింది.దీంతో ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాపోతున్నారు.యూ ఉన్నతధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించిన వారు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.పెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఇప్పటికైనా ఉన్నతధికారులు స్పందించి రోడ్లకు మరమ్మత్తులు చేయడానికి చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

# పెట్టుబడులు బారేడు దిగుబడి సారేడు..

## - అన్నం పెట్టే రైతులకు ఆదరణ కరువు - రైతు ఆశలు నడి ఆశలే



**బోథ్, ప్రభాతవార్త**

భారీ వర్షాల కారణంగా పత్తి, సోయ పంటలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ సంవత్సరం రైతులు అధిక మొత్తంలో పత్తి, సోయ పంటల సాగునె నమ్ముకున్నారు . మొదట్లో వర్షాలు అనుకూలించకపోవడంతో దిగుబడి బాగా వస్తుందని ఆశపడ్డ రైతులు, పంట చేతి కందే సమయంలో వర్షాలు అధికంగా కురవడంతో చాలా మేరకు పూత కాత రాలిపోవడం జరిగాయి. ఈ 3 నెలలుగా కురిసిన ఏకధాటి వర్షాలకు పత్తి చేలలో అధికంగా వర్షపు నీరు వచ్చి చేరగా నీటిలో మునిగిన తొలి పత్తి కాయలు మురిగి పోయాయి. అతివృష్టి, అనావృష్టికి తోడు తెగులు అధికమై పంటలు పాడైపోయాయి. దీనికి తోడు యూరియా కొరత అలాగే కురిసిన భారీ వర్షాల కారణంగా రైతులు తమ చేలల్లో కలుపు తీయించలేని పరిస్థితులు నెలకొన్నాయి. గడ్డి జాతిని నివారించడానికి ఒకటికి రెండుసార్లు గడ్డి మందులు పిచికారి చేయడం ద్వారా ఉన్న కాస్త పూత రాలిపోవడం జరిగాయి. రైతులు ఒక ఎకరానికి 20 నుండి 30 వేల వరకు పెట్టుబడులు పెట్టి ఉండగా . అయితే ఒక ఎకరానికి 5 క్వింటల్లా పత్తి దిగుబడి వచ్చే అవకాశం లేదంటున్న రైతంగం పత్తి ఏరివేత ప్రారంభం చేసిన కాయలు విచ్చుకోక దూది బయటకు రాలేని పరిస్థితులు ఉన్నాయి. చేతి కందిన అరకొర పంటనైన అమ్ముకుందామని మార్కెట్లోకి తరలిద్దామంటే సిసిఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కాకపోవడం రైతు పాలిట శాపంగా మారాయి. వర్షాలు ముగిసి వారం రోజులు కావస్తున్న చేలల్లో తాడి అరడం లేక కొన్ని చోట్ల సోయ తీయలేని పరిస్థితులు నెలకొన్నాయి.పెద్ద చదువులు చదువుతున్న యువకుల సైతం వ్యవసాయంపై మక్కువ చూపుతూ ఇప్పుడిప్పుడే తొలి అడుగులు వేస్తున్న యువ రైతులకు గడ్డుకాలం ఎదురయింది. ఇక కౌలు రైతులు అప్పులు చేసి పొలాన్ని పట్టుకొని పండించిన పంటలకు ఆశించినంతగా దిగుబడులు రాక చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియని సందిగ్ధంలో మునిగిపోయారు. ఖరీఫ్ పంటలు కొనుగోలుకు ముందే రైతులు రబి పంటల్లో నిమగ్నమయ్యారు .ఇకనైనా రైతుల గోడును ఆలకించి రాష్ట్ర ప్రభుత్వం నష్టపోయిన రైతులకు న్యాయం జరిగే విధంగా తగు చర్యలు చేపట్టాలని వాపోతున్నారు.










# అడవిలో పెద్దపులి అలజడి

## అప్రమత్తమైన అడవి సిబ్బంది



**బోథ్, ప్రభాతవార్త**

ఘన్‌పూర్ మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో పెద్దపులి, చిరుతల, అలికిడి. ఈ అడవి ప్రాంతంలో ఎటు చూసినా పచ్చదనం. ఎత్తైన గుట్టలు అనేక రకాల వృక్షజాతులు. వివిధ రకాల వన్యప్రాణులు. సరస్సులను తలపించేలా నీటి వసతులు కలిగిన ప్రాంతం ఈ అడవి సొంతం మహారాష్ట్ర తిప్పేశ్వర్, తడోబా వైపు నుండి ప్రతి ఏడాది పులులు వలస వస్తూ పోతున్నాయి. వాటి మనుగడ కోసం వాతావరణం అనుకూలించినంత వరకు సంచరిస్తూ ఉంటాయని. అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. కొత్త ఆవాసం, తోడు, ఆహారం కోసం పులులు వాటి మనుగడ సాగిస్తూ ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతం వైపు తిరుగుతూ ఉంటాయి. ఆహారం సంపాదించుకునే క్రమంలో పశువులపై దాడి చేస్తాయి. అయితే పులి దాడిలో హతమైన పశువుల యజమానులకు మూగజీవాల ఆకారాన్ని బట్టి సంబంధిత అధికారులు నష్టపరిహారాన్ని అందజేస్తారు. పులులు వేటాడే క్రమంలో పైనుండి దిగవ ప్రాంతాలకు తిరుగుతుంటాయి. ఈ క్రమంలో రైతులు తమ పంట పొలాల్లో అమర్చిన విద్యుత్ తీగలు, తగిలి చనిపోయే ఆస్కారం ఉంది, అడవి పందుల కోసం ఇతర ఏ విష ప్రయోగాల ద్వారానైన మృతిచెందే అవకాశాలు ఎక్కువ, కాబట్టి అంతరించిపోతున్న వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా వ్యవహరించి. వాటికి రక్షణ కల్పించాలి. హాని తలపెడితే వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం వన్యప్రాణుల చట్టం కింద నాన్ బెయిలబుల్ కేసు నమోదవుతుంది. పెద్దపులి సంచరించిన తీరం వైపు ఒంటరిగా వెళ్లొద్దు. చేతిలో కర్రలతో రక్షణగా గుంపులుగా తిరగాలి. సమీప అడవుల్లోకి మూగ జీవాలను మేతకు తీసుకెళ్లవద్దు. చేలలో గుంపులుగా ఉండాలి. పులి కనబడితే భయభ్రాంతులకు గురై పరుగులు పెట్టవద్దు. ఎదురుగా వచ్చిన ధైర్యంగా ఉండాలి. సాయంత్రం ఐదు గంటల లోపు నివాసాలకు చేరుకోవాలి. పులి కనిపించినట్లయితే సంబంధిత అధికారులకు సమాచారం అందివ్వాలి.




### పాఠశాల మార్గాల్లో చెత్త కుప్పలు..

# చిన్నారులకు ఇబ్బందులు

*** స్థానికుల ఆగ్రహం * అధికారుల నిరక్ష్యం**

**రామకృష్ణాపూర్, ప్రభాతవార్త**

పట్టణంలోని ఠాగూర్ నగర్ సి2 క్వాటర్స్, పాఠశాల సమీప ప్రాంతాల్లో చెత్త కుప్పలు పెరిగిపోవడంతో విద్యార్థులు, కాలినడక వెళ్లే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి ఉదయం పాఠశాలకు వెళ్లే చిన్నారులు చెత్త దిబ్బల మధ్యన నడవాల్సిన పరిస్థితి నెలకొంది. చెత్తను ప్రతిరోజూ తొలగించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, స్థానిక అధికారులు నిరక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తడి చెత్త కారణంగా దోమలు విస్తరించి, పిల్లల్లో విషజ్వరాలు, చర్మవ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పాఠశాల పరిసరాల్లో ఇలాంటి అస్వచ్ఛ వాతావరణం కొనసాగడం చిన్నారుల ఆరోగ్యానికి హానికరమని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని చెత్త కుప్పలను తొలగించి పరిసరాలను శుభ్రపరచాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.




### లక్షలు వెచ్చించి..

# లక్షణంగా వదిలేశారు

**వాంకిడి, ప్రభావతవార్త**

*మండల కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం ప్రయాణికులకు నిరుపయోగంగా మారింది. లక్షలు వెచ్చించి లక్షణంగా వదిలేశారు. హైవే రోడ్డుకు ఆనుకొని సర్వీస్ రోడ్డు వేయడంతో హైవే రోడ్డు వేసేవారు సైడ్ డ్రైన్ నిర్మించడం వల్ల బస్సులు లోపలికి వెళ్లడం లేదు. ఆది నుండి నిరుపయోగంగానే మారిందని స్థానికులు అంటున్నారు. మండల కేంద్రంలో మరుగుదొడ్లు కూడా లేకపోవడంతో కార్యాలయానికి వచే చుట్టుపక్కల గ్రామస్తులు సంతకు వచ్చే ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మరుగుదొడ్లు నిర్మించాలని బస్సు షెల్టర్ ను ప్రయోజనమునకు తేవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.*

# ఏజెన్సీ ప్రాంతంలో రోడ్డుభాగలేక రాకపోకలకు, తప్పని తిప్పలు

**లింగాపూర్, అక్టోబర్ 18, ప్రభాతవార్త**

మండలంలోని దంపూర్, లొద్దిగూడ, మోడీగూడ, గ్రామాలకు రోడ్డు మొత్తం లొందలతో కంకర తేలి ,రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. వర్షాకాలం అయితే కూలిపోయిన బ్రిడ్జిల వద్ద వాగు పొంగిపొర్లుతుంది. ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు మేము గెలిస్తే రోడ్డు వేస్తాం అని చెప్పి. ఎన్నికల అయిన తర్వాత మా ప్రాంతాలను మరిచిపోతారు, నాయకులకు ఓట్ల మీద ఉన్న శ్రద్ధ, మా ఏజెన్సీ గ్రామ వాసుల ,అభివృద్ధి మీద. రోడ్డు బాగు చేయడం మీద లేదు. మా గ్రామాల ప్రజలకు ఆసుపత్రికి అత్యవసర పరిస్థితిలో ఆసుపత్రికి వెళ్లాలన్న రోడ్డు బాగాలేక. అంబులెన్స్ రాలేక ప్రవేట్ వాహనాలను ఆశ్రయించవలసి వస్తుంది. అత్యవసర అయిన సమయంలో ప్రైవేట్ వాహనాల ద్వారా ఆసుపత్రికి చేరలేకపోతున్నాము. కొన్ని సమయాలలో సరైన సమయంలో ఆసుపత్రికి చేరలేక ప్రాణాలు విడిచిన రోజులు కూడా ఉన్నాయి. లింగాపూర్ మండల కేంద్రం నుండి పంగిడి మాధోర వరకు రోడ్డు బాగు చేస్తే మండల వాసులకు జిల్లా కేంద్రానికి వెళ్ళడానికి చాలా దగ్గర పడుతుంది అని మండల ప్రజలు కోరుతున్నారు. మా గోస మా పరిస్థితిని అర్థం చేసుకొని, సంబంధిత అధికారులు సత్వరమే త్వరగా స్పందించి రోడ్డు బాగు చేయాలని. చిరంజీవి మాజీ సర్పంచ్. మెస్రం మనోహర్, తోడసం భగవంతురావు, సైను సాబ్, కుమరం రామచందర్ తదితరులు కోరుతున్నారు.



# అనార్‌పల్లి వాగుపై వంతెన నిర్మించేది ఎప్పుడు..?

## 7 గ్రామాల ప్రజల కష్టాలు తీరేది ఎప్పుడు



**కెరిమెరి, ప్రభాతవార్త**

పల్లెలు దేశానికి పట్టుకొమ్మలు వేదికలపై ఊక దంపుడు ఉపన్యాసాలు చెప్పే పాలకుల ఊకదంపుడు మాటలు నీటి మూటలుగా మిగిలాయి దీనికి నిదర్శనమే అనార్పల్లి వాగు వంతెన వాగు అవతలి వైపు ఎనిమిది గ్రామాల ప్రజల కష్టాలు వర్ణాతీతం మండలంలోని అనార్పల్లి పెద్దవాగు వంతెన లేకపోవడంతో వాగు అవతలి వైపు ఉన్న కరేంజవాడ పెద్దకరంజవాడ గోండుగూడా అందుగుడా దురువపటార్ బోరెల్లాలగూడ జంకాపూర్ గ్రామాల ప్రజలకు పాలిట శాపంగా మారింది వర్షాకాలం వచ్చిందంటే చాలు ఆ గ్రామస్తుల బాధలు వర్ణతీతం ఆ గ్రామాలకు ఆటోలు ద్విచక్ర వాహనాలు వెళ్ళలేని పరిస్థితి ఓవైపు ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు పెద్దవాగు నిండుగా ప్రవహిస్తుంది. దీంతో ఆ ఏడు గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి చేరుకోవాలంటే నానా తంటాలు పడాల్సి వస్తుందని గిరిజన



ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు అత్యవసర సమయాల్లో కొంతమంది నదీ ప్రవాహంలో ఏదుకుంటూ మండల కేంద్రానికి చేరుకుంటారు ఏ చిన్న పనైనా మండల కేంద్రంలోనికి రాక తప్పదు ఈ పరిస్థితుల్లో ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని వాగు దాటాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఏండ్లుగా తమ కష్టాలు తీరడం లేదని గిరిజనులు వాపోతున్నారు. పెద్దవాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని ఆ గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు. త్వరగా మంతెన నిర్మాణం చేపట్టాలి. బోర్లాల్ గూడా గ్రామస్తుడు రాథోడ్ రమేష్ వర్షాకాలం మా గ్రామానికి వెళ్లాలంటే అష్ట కష్టాలు పడాల్సిందే మార్గమధ్యలో పెద్దవాగుతో ఇబ్బందులు పడుతున్నాం. గర్భిణీ స్త్రీలు వృద్ధులను అత్యవస సమయాల్లో అతి కష్టం మీద వాగు దాటించాల్సి వస్తుంది దశాబ్ద కాలంగా ఈ పెద్దవాగు సమస్య తీరడం లేదు పలుమార్లు పాలకుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకపోయింది. ఇప్పటికైనా పాలకులు స్పందించి అనార్‌పల్లి పెద్దవాగుపై వంతెన నిర్మించాలి.



## దిండ గ్రామం బ్రిడ్జి కోసం

# దశాబ్దాల నిరీక్షణ

### వరదలొచ్చాక ఒంటరిద్వీపం - కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా, చింతలమానేపల్లి మండలం, దిండ గ్రామం

**చింతలమానేపల్లి, ప్రభాతవార్త**

మండలంలోని దిండ గ్రామం ప్రజలు వర్షాకాలం వస్తుందంటేనే భయపడుతున్నారు. ప్రాణహిత నది బ్యాక్‌వాటర్స్‌తో పాటు వాగులు ఉప్పొంగి గ్రామం చుట్టూ నీరు చేరడంతో ప్రతి ఏడాది ఈ గ్రామం ఒంటరి ద్వీపంగా మారిపోతుంది. దాదాపు 2,000 మంది జనాభా ఉన్న ఈ గ్రామం వరదల సమయంలో బయటి ప్రపంచంతో సంబంధాలు కోల్పోతుంది. రవాణా సౌకర్యాలు లేక ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో 2015లో ఎంబీఏ విద్యార్థి రామకృష్ణ వాగులో కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయాడు. ఆ ఘటన అనంతరం బ్రిడ్జి నిర్మిస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకు ఆ హామీ అమలు కాలేదు.ప్రతి వర్షాకాలంలో గ్రామస్తులు బయటకు వెళ్లేందుకు కర్ర పడవలపై ఆధారపడుతున్నారు. బ్రిడ్జి నిర్మాణం కోసం టెంట్లు వేసి ధర్నాలు చేసిన, పాదయాత్రగా కలెక్టరేట్‌ను ముట్టడించిన ఫలితం లేకపోయింది. రోగులు, గర్భిణీ స్త్రీలు, విద్యార్థులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం కనీసం రెండు కోట్లు కేటాయించి బ్రిడ్జి నిర్మిస్తే గ్రామం ప్రాణహిత జలాల బంధనం నుండి విముక్తి పొందుతుంది” అని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# పూర్తి కాని నిర్మాణ పనులు

**దిలావర్పూర్, ప్రభాతవార్త**



గత బిఆర్ఎస్ ప్రభుత్వం పేదల ఇండ్ల కోసం రెండు పడకల ఇండ్ల నిర్మాణాల పథకమును తెచ్చింది. దిలావర్పూర్ మండల కేంద్రంతో పాటు, బన్సపల్లి గ్రామాలలో ఇండ్ల నిర్మాణాలను ప్రారంభించింది. కొన్ని నిర్మాణాలు పూర్తయిన మరికొన్ని నిర్మాణాలు పిల్లర్ల వద్దే నిలిచిపోయింది. బన్సపల్లి గ్రామంలో 42 ఇండ్ల నిర్మాణాలు పేదల కోసం మంజూరయ్యాయి. అయితే పునాది, పిల్లర్లు వేసి వదిలేశారు. ఈ విషయంపై సదర్ కాంట్రాక్టర్లను అడగగా ఇప్పటివరకు ముగ్గురు కాంట్రాక్టర్లు మారారని సరైన నిధులు రాకపోవడంతో ఉన్న నిర్మాణాలను నిలిపివేసినట్లు వారు తెలిపారు. ఆదిలోనే ఇండ్లు నిలిచిపోవడంతో అటు లబ్ధిదారుల ఆశలు నిరాశయ్యాయి. అంతేకాకుండా ప్రభుత్వ సొమ్ము వృధా అయ్యిందని విమర్శలు వస్తున్నాయి. ఆ ఇండ్ల నిర్మాణాల కోసం తెచ్చిన ఇసుక, కాంక్రీట్ తదితర వస్తువులను గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లారు. మరికొన్ని గ్రామాలలో నిర్మించిన ఇండ్లు నిరుపయోగంగా మారడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసి పేదలకు ఇప్పించాలని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



# బస్ షెల్టర్లు లేక ప్రయాణికుల అవస్థలు



దిలావర్‌పూర్, ప్రభాతవార్త

మండల కేంద్రంతోపాటు గుండంపల్లి ఎక్స్ రోడ్ వద్ద బస్ స్టేషన్ షెల్టర్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎండ, వాన, చలి కాలాలలోనూ ప్రయాణికులు రోడ్డు పక్కన గల చెట్టు కింద వాహనాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. మాడేగాం, కదిలి గ్రామాల నుండే కాకుండా ప్రభుత్వ కార్యాలయాలలోకి అవసర నిమిత్తం వారికి ఇబ్బందులు తప్పడం లేదు. 61వ జాతీయ రహదారి కావడం, అంతే కాకుండా కొద్ది దూరంలో టోల్ ప్లాజా ఉండడం కొసమెరుపు. రహదారికి సంబంధించిన అధికారులకు తెలిపినప్పటికీ ఈ సమస్య పరిష్కారం కావడం లేదని చెబుతున్నారు. అటు అధికారులను అడగగా జాతీయ రహదారి విస్తరణ చేయనున్నామని త్వరలో షెల్టర్‌ల నిర్మాణాలు చేపడతామని వారు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా బస్ షెల్టర్లు లేక అవస్థలు ఎదుర్కోక తప్పడం లేదు.






























# దివ్య వెలుగుల దీపావళి..

* చెడుపై గెలిచిన మంచికి ప్రతీకగా సంబరాలు
* ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 19, ప్రభాతవార్త

**అన్ని పండగల్లో దీపావళి చాలా ప్రత్యేకం. పిల్లలు.. మహిళలు.. పురుషులు.. వ్యాపారులు.. రైతులు.. కొత్త అల్లుళ్లు.. ఇలా అందరిదీ ఈ పండుగ. నరక చతుర్దశి నాడు ఉదయాన్నే తలంటు స్నానాలు మొదలు..రెండు రోజుల పాటు ఇంటిల్లిపాదీ సందడిలో పాల్గొంటారు. బొమ్మల కొలువులో మహిళలు.. టపాసులతో పిల్లలు,పురుషులు.. మహా లక్ష్మిని పూజిస్తూ వ్యాపారులు.. పశువులను కొలుస్తూ అన్నదాతలు బిజీబిజీగా గడుపుతారు. ప్రకృతిపరంగానూ దివ్వెల పండుగది ప్రత్యేక రీతి. అత్యంత పవిత్రమైన కార్తీక మాసం ప్రారంభానికి.. వణికించే చలికాలం తోడు వుతుంది. వీటన్నింటినీ మించి మతాబులు.. చిచ్చుబుడ్లు.. కాకరపువ్వొత్తులు.. భూచక్రాల పొగకు దోమల దండు పరార్. అందుకే ఇది శుభ దీపావళి...**

ప్రతి ఇంటా సిరులు పండాలని ఆనందం నిం డాలని జిల్లాలో ప్రతి వాకిట వెలుగులు విరియాలని కోరుతూ దీపావళి పండగను సంతో షంగా జరుపుకొంటున్నారు. ఏ వీధి చూసిన బాణ సంచా చెప్పుళ్లే, పండగ కాస్తంత ముందుగానే వచ్చినట్లు కనబడుతోంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోనూ దీపావళి కళ ఉట్టిపడుతుంది. పండగ సందర్భంగా వచ్చిన బంధువులతో ఆయా గ్రామాల్లో సందడి నెలకొనగా.. పట్టణంలో మూడు రోజుల ముందు నుంచే తెరుచుకున్న టపాసు దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. నూతన వస్త్రాల కోసం పిల్లాపెద్దలు తరలిరావడంతో వస్త్ర దుకాణాలన్నీ నిండుగా కనిపిస్తున్నాయి. నూనె ఒత్తులను వెలిగించడం కోసం ఇంట్లోదాచిన ప్రమిదలు మళ్లీ సిద్ధమవుతున్నాయి. వైవిద్యభరితమైన వివిధ రకాలైన ప్రవిధలు మార్కెట్లో కొలువుదీరాయి. పూలదుకాణాలు, మిఠాయి దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. రంగురంగుల ప్రమిధలు కొనుగోళ్లుచేయడానికి మహిళలు ఆసక్తి చూపుతున్నారు.దీపావళికి రెండురోజుల ముందే ప్రత్యేకంగా ఇళ్లు,వాణిజ్య దుకాణాలల్లో పూజలు చేస్తూ దానికి సంబంధించిన ఆచార వ్యవహారాలను సంప్రదాసిద్ధంగా నిర్వ హిస్తున్నారు. అందులో భాగంగా లక్ష్మీ దేవికి పూజలు చేసి ధనాన్ని పొదుపుచేసేలానిర్ణయాలు తీసుకు న్నారు. అంటే స్థిరాస్తి రూపాలైన బంగారం, భూమివంటి కొనుగోళ్ల కు శ్రీకారంచుట్టారు. మరుసటి రోజు నువ్వులనూనే రాసుకుని, నలుగు పిండితో స్నానమాచరి స్తారు. ఉత్తరేణిమొక్కతో చిన్నపిల్లల కు దిష్టితీస్తుంటారు.





## పోచమ్మ సన్నిధి సమస్యలమయం

సారంగాపూర్, అక్టోబర్ 19, ప్రభాతవార్త



మండల కేంద్రంలో ఉన్న అడెల్లి పోచమ్మ దేవాలయం జిల్లాలోనే సుప్రసిద్ధమైన దేవాలయం నిత్యం భక్తులతో నిండి ఉండే ఆలయ పరిసరాలు భక్తులు వంటలు చేసుకోవడానికి స్థలం లేకపోవడంతో ఆలయం ముందరలోని వంటలు చేసుకోవడం జరుగుతుంది. ఆలయం వెనుక భాగంలో మొత్తం మురికి నీరు నిలువ ఉండడం జరిగింది. ఆ మురికి నీరును తీసివేస్తే ఆ పరిసర ప్రదేశాలలో వంటలు చేసుకోవడం అవకాశం ఉంటుంది. వచ్చే భక్తులకు ఆలయ సమీప పరిసరాలలో రద్దీ ఉండదు. భక్తులు కోనేరులో స్నానాలు చేసి అమ్మవారిని దర్శించుకుంటారు. కోనేరు వద్ద స్నానాలు చేసిన నీరు రోడ్డుపైకి వస్తుంది నడుచుకుంటు వచ్చే భక్తులు ఆ స్నానపు నీటి నుండే రావడం అవుతుంది. అది అపవిత్రమైనటువంటిది అ మురికి నీరు అక్కడే ఉన్నటువంటి కల్వర్టును మూసివేయడంతో రోడ్డు పైకి రావడం జరుగుతుంది. దీనిని నిత్యం ఆలయం అధికారి, చైర్మన్ చూస్తూ ఉన్నారు. మురికి నీరును కల్వర్టు కింది నుంచి పోయి విధంగా చేసి భక్తులకు ఇబ్బంది జరగకుండా చూసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు

రామకృష్ణాపూర్, అక్టోబర్ 19, ప్రభాతవార్త

జాతీయ రహదారులపై తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు రామకృష్ణాపూర్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా రాంగ్ రూట్‌లో వాహనాలు నడిపిన పలువురు ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే లైసెన్స్ లేని డ్రైవర్లపై జరిమానాలు విధించి, పత్రాలు లేని వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. రోడ్డు ప్రమాదాల వలన అనేక ప్రాణనష్టం జరుగుతోందని, ఇప్పటికే పలుమార్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ కొంతమంది నిరక్ష్యంగా రాంగ్ రూట్‌లో వాహనాలు నడుపుతున్నారని పేర్కొన్నారు. ఇకపై ఎవరైనా రోడ్డు నియమాలను ఉల్లంఘించి రాంగ్ రూట్‌లో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై రాజశేఖర్ స్పష్టం చేశారు.



## అంబరన్నంటిన దండరీ, గుస్సాడి నృత్యాలు

బజార్‌హత్నూర్, అక్టోబర్ 19, ప్రభాతవార్త

మండలంలోని చింతల సాంగ్వీ గ్రామంలో గుస్సాడి దండారి పండుగ ఘనంగా జరిపారు. దండారి పండుగ లో భాగంగా సోనాల మండలంలోని పార్డీ (బి) గ్రామం యొక్క గుస్సాడిలను ఆహ్వానించారు. శనివారం రాత్రి 7 గం.లకు విచ్చేసిన పార్డీ (బి) గుస్సాడి, గ్రామస్తులను చింతల సాంగ్వీ గ్రామస్తులు గుస్సాడి నృత్యాలతో ఘనంగా ఆహ్వానించారు. క్షేమ సమాచారాలు తెలిపి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మరసటి రోజు ఆదివారం నాడు పార్డి (బి) గ్రామ యువకులు చచ్చోయ్, గుస్సాడి నృత్యాలు, రేల పాటలు, గుమేల పాటలు, డప్పుల మోతలతో గ్రామంలో పండుగ వాతావరణం నేలకోంది. పర, వేటే, కోడల్, గుస్సాడి టోపిలతో, యేత్మ దేవతను పుజలు చేసి, అన్నదానం నిర్వహించారు. వాళ్ల గ్రామానికి వచ్చిన గుస్సాడీలకు సకల మర్యాదలు చేసి సాగనంపారు. ఈ కార్యక్రమంలో చింతల సాంగ్వీ, పార్డి (బి) గ్రామ పటేలు దెవరి మహాజన్, సీడం సుభాష్, బ్నీ రావ్, జంగు, భూమన్న, హన్మంతు, జగదీష్, లక్ష్మన్, ఇరు గ్రామ యువకులు, మహిళలు పాల్గొన్నారు.





## గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి

### - ఈస్గాం ఎస్ఐ కళ్యాణ్

కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 19,ప్రభాతవార్త

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని కాగజ్‌నగర్ మండలం ఈస్గాం ఎస్ఐ కళ్యాణ్ అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్ మండలంలోని ఆరెగూడ పాఠశాల ప్రాంగణంలో గ్రామ యూత్,గ్రామ పెద్దల ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై ఆరెగూడ జిల్లా పరిషత్ సెకండరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు పర్ష చంద్రశేఖర్‌తో కలిసి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా పోటీలు నిర్వహించం వల్ల యువతతో క్రీడా స్ఫూర్తి,ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందన్నారు. యువత వాలీబాల్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. గ్రామంలోని యువత చెడు వ్యవసనాలకు అలవాటు పడి భవిష్యత్తు నాశనం చేసుకోకుండాయువత చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బుర్కటి పురుషోత్తం,మాజీ ఉపసర్పంచ్ రౌత్ సంతోష్,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొమ్ము లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు,తదితరులు పాల్గొన్నారు.



## వృద్ధురాలికి చేయూతనందించిన ఎస్ఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు



చింతలమానేపల్లి, అక్టోబర్ 19, ప్రభాతవార్త

మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన పూసల జగదాంబ అనే వృద్ధురాలికి ఎస్.ఆర్.ఎస్ యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు గుర్లే శ్రీనివాస్ గ్యాస్ సిలిండర్, 30 కిలోల బియ్యం అందించి మానవత్వం చాటుకున్నారు. వృద్ధురాలు భర్త మరణంతో ఒంటరిగా జీవిస్తోందని తెలుసుకున్న శ్రీనివాస్, యూత్ సభ్యులతో కలిసి సాయం అందించారు. ఇలాంటి సేవా మార్గంలో యువత ముందుండాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు విలాస్, విజయ్, యువ నాయకులు డోంగ్రి సంతోష్, జుమిడి సాగర్, గ్రామస్థులు జుమిడి వసంత్, దూలం బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

## వెలుగులకే అందాలు..

# మట్టి ప్రమిదలు


**☆ ఆకట్టుకుంటున్న విభిన్న ఆకృతులు ☆ దీపావళిలో ఎంతో ప్రత్యేకం**



**కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 19, ప్రభాతవార్త**

ఎర్ర మట్టితో జీవం పోసుకునే బొమ్మలతో కూడిన ప్రమిదలంటే ఎంతో ప్రేమ. ప్రాచీన కళాసాంప్రదాయమైన ఈ కళాప్రక్రియకు ఎప్పటికప్పుడు ఆధునికతను జత చేసుకొని నిత్యశోభను సంతరించుకునే మట్టి ప్రమిదలు దీపావళి పండగను పురస్కరించుకొని కొత్త భూమికతో కాగజ్‌నగర్‌కు చుట్టపు చూపుగా వచ్చాయి. హారతులు అందించేందుకు అందంగా ముస్తాబై చుట్టు పక్కల ప్రజలను స్వాగతిస్తున్నాయి. ఎన్నెన్నో అందాలు..అమావాస్య చీకటిని సైతం లెక్కచేయకుండా కాంతులీనడానికి ఇంటింటా సమాహారమయ్యే దీపపు కుందెలు, ప్రమిదలు దీపావళి పండగలో ముఖ్య భూమికను పోషిస్తుంటాయి. శుభానికి చిరునామాగా పసుపు,





పారాణి అలంకరణతో ముస్తాబైన ఇంటి గడప, ప్రహరి, ప్రాంగణం, వాకిళ్లలో ఒక్కొక్కటిగా జతయ్యి.. పసిడికాం తుల్ని నింపుతూ భారతీయ సాంప్రదాయాన్ని ఆవిష్కరించే ప్రమిదల కొలువు దీపావళి వేడుకల్లో చూసి తీరాల్సిందే. ఈ ప్రత్యేకతను పురస్కరించుకొని స్థానికంగా కొంత మంది వ్యాపారులు వివిధ రూపాల్లో రూపొందించిన ప్రమిదలను హైదరాబాద్, రాజస్థాన్, తమిళ నాడు రాష్ట్రాల నుంచి మట్టి, సిరామిక్ దీపాలను గద్వాలకు తీసుకవచ్చి విక్రయిస్తున్నారు. డిజైన్‌ను బట్టి జత రూ.30 నుంచి రూ.150 వరకు అమ్ముతున్నారు. పట్టణంలోని స్థానిక కూరగాయల మార్కెట్ సమీపంలో ప్రమిదలు కొలువుదీరాయి.

### దీపాలు వెలిగిస్తే శుభం : భాగ్య



దీపావళి పండగకు దీప తోరణాలు వెలిగించే ఆచారం ఉంది. ఆరోజు శ్రీ మహాలక్ష్మిదేవి భూలోకానికి వచ్చి ఇంటింటికీ తిరుగుతుందని నమ్మకం. అందుకే ప్రజలు లక్ష్మిదేవికి నీరాజనాలు పలుకుతూ తమ ఇంట్లో, బయట దీపాలు వెలిగిస్తారు. దీపాల వరుసను వృత్తాకారంలో, స్వస్తిక్ ఆకారంలోనూ పేర్చి వెలిగిస్తే మరింత మంచిది.

# ఆవుపేడతో చేసిన ప్రమిదల పంపిణీ

**- దీపాలను వెలిగించిన ఎమ్మెల్యే**

**బోథ్, అక్టోబర్ 19, ప్రభాతవార్త**

బోథ్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఎఫ్ఆర్ఓ ప్రణయ్ సహకారంతో ఆదివారం స్థానిక రైతు వేదికలో ఏర్పాటు చేసిన ఉచిత ప్రమిదల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆవు పేడతో తయారు చేసిన ప్రమిదలను ఎమ్మెల్యే మహిళలకు ఉచితంగా పంపిణీ చేశారు. శాసనసభ్యుడు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగ్యస్వామ్యం కావాలని పర్యావరణానికి హాని కలిగించని, ప్రకృతిలో సహజ సిద్ధంగా లభించే ఆవుపేడతో ప్రమిదలను తయారుచేసి ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. ఆవు పేడతో తయారుచేసిన ప్రమిదలకు మండే స్వభావం ఉంటుందని. ఉపయోగించిన తర్వాత మట్టిలో కలిసిపోయే స్వభావంను కలిగి ఉండడం వలన వీటి వాడకంతో పర్యావరణానికి మేలు తప్ప ఎలాంటి కీడు లేదన్నారు. ప్రకృతి, వన్య సంపదను ఈ ప్రాంత జలపాతాల విశిష్టతను ప్రపంచం ముంగిట నిలబడంతో పాటు పర్యావరణ పరిరక్షణ జీవవైవిధ్య సంరక్షణ కోసం సొసైటీని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇటీవలే అటవీ శాఖ, బోథ్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రఖ్యాత పోచ్చర జలపాతం వద్ద రివర్ ర్యాక్టింగ్ నిర్వహించడంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపును తెచ్చి పెట్టిందని భవిష్యత్తులో సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టే ప్రతీ కార్యక్రమానికి తన సంపూర్ణ సహకారాలు ఉంటాయని అన్నారు. అనంతరం సొసైటీ అధ్యక్షుడు షేక్ అలీ మాట్లాడుతూ బోథ్ ప్రాంతంలోని వన సంపద, జలపాతాల ప్రాముఖ్యతను ప్రపంచానికి తెలపాలన్న లక్ష్యంతో సొసైటీని ఏర్పాటు చేశామని తెలిపారు. భవిష్యత్తులో సొసైటీ ఆధ్వర్యంలో పర్యావరణ హితమైన అనేక కార్యక్రమాలు చేపట్టడంతోపాటు వన్యప్రాణుల సంరక్షణపై విద్యార్థులకు, రైతులకు, ప్రజలలో అవగాహన కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ రేంజ్ అధికారి ప్రణయ్, ఎంపీడీవో రమేష్, సొసైటీ ఉపాధ్యక్షుడు దాసరి పురుషోత్తం, సభ్యులు అబ్దుల్ రావుఫ్, రమణ గౌడ్, అల్లం సాయిక్రిష్ణ, మునిగేల శ్రీధర్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.





## వెడ్మ రాము వర్ధంతిని

# ఘనంగా నిర్వహించాలి

**- ఎమ్మెల్యే కోవ లక్ష్మి**

**ఆసిఫాబాద్, అక్టోబర్ 19, ప్రభాతవార్త**

అమరజీవి వెడ్మ రాము 38వ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో వెడ్మ రాము వర్ధంతికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వెడ్మ రాము చేసిన సేవలు, పోరాటాలను కొనియాడుతూ, గిరిజన హక్కుల కోసం ఆయన చేసిన త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తిర్యాణి మండలం ఏదూలాపాడ్ గ్రామంలో ఈనెల 26న జరిగే వర్ధంతి వేడుకల్లో ఆదివాసులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెడ్మ రాము కార్య నిర్వహణ కమిటీ సభ్యులు చాహకటి దస్రు, ఆత్రం సంతోష్ కుమార్, వెడ్మ తిరుపతి, చాహకటి వెంకటేష్, కుర్సెంగా నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.



# ఘోర రోడ్డు ప్రమాదం..

**✶ బైక్‌ను ఢీ కొట్టిన కారు.... ✶ ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి ✶ పండగపూట విషాదం**

ఆసిఫాబాద్, అక్టోబర్ 19, ప్రభాతవార్త

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండల పరిధిలోని వంజిరి గ్రామంకు చెందిన అక్కను ఆమె కుమారుడు (అల్లునికి) వాంకిడి మండలం బెండరకు చెందిన తమ్ముడు దీపావళి పండుగకు పిల్లలతో కలిసి ద్విచక్ర వాహనంపై పుట్టింటికి సంతోషంగా వెళ్తున్న క్రమంలో ఒక కారు వెనుక నుంచి ఢీకొనడంతో ముగ్గురు మృతి చెందగా మరొకరికి గాయాలైన సంఘటన ఆదివారం ఆసిఫాబాద్ మండలంలో పండగ పూట విషాద ఘటన చోటు చేసుకుంది. ఆసిఫాబాద్ సీఐ బాలాజీ వరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం కాగజ్‌నగర్ మండలంలోని వంజీరి గ్రామానికి చెందిన జగన్ (27), డోంగ్రి అనుసూయ(32) ప్రజ్ఞశీల్ 4, మరో పాపతో కలిసి దీపావళి పండగను జరుపుకోనెందుకు వాంకిడి మండలంలోని బెండార గ్రామానికి బయలుదేరారు. బైక్ ఎక్కించుకొని బెండారకు వస్తున్న క్రమంలో మోతుగూడ సమీపంలో బైక్ ను కారు వెనుక నుంచి అతివేగంగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో జగన్ తో పాటు అక్క అనుసూయ, మేనల్లుడు ప్రజ్ఞాశీల్ అక్కడిక్కడే



మృతి చెందారు. తీవ్ర గాయాలతో ఉన్న మరో పాప చికిత్స కోసం ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరందరూ ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ప్రమాదం తెలుసుకున్న సిర్పూర్ ఎమ్మెల్యే హరీష్ బాబు సంఘటన స్థలం చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాదానికి కారణమైన వారిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# 26న వెడ్మ రాము వర్ధంతి

**- కరపత్రాలను విడుదల చేసిన నాయకులు**



తిర్యాని, అక్టోబర్19, ప్రభాతవార్త

ఆదివాసీ కళాకారుడు వెడమ రాము 38 వ వర్ధంతిని ఈనెల 26న తిర్యాని మండలంలోని ఏదులాపాడ్ గ్రామంలో నిర్వహించనున్న నేపథ్యంలో రోంపల్లిలో కొమరం భీం 85 వ వర్ధంతి సందర్భంగా వెడ్మ రాము వర్ధం కార్యనిర్వహణ కమిటి సభ్యులు,జిల్లా తోటి సంఘం నాయకులు ఆదివాసి తెగల నాయకులతో కలిసి వెడమ రాము వర్ధంతి కరపత్రాలను విడుదల చేశారు.ఈ సందర్బండా రాము వర్ధంతి నిర్వహణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ జిల్లాలోని ఆదివాసీలు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో ఆత్రం సంతోష్ కుమార్,రాయి సెంటర్ జిల్లా మేడి కుర్సింగ మోతిరాం,రాజ్ గోండు సేవా సమితి ప్రధాన కార్యదర్శి మడావి గుణవంతరావు,రాజ్ గోండు ఉపాధ్యక్షులు మాడావి నర్సింగరావు,రాయి సెంటర్ నాయకులు కోట్నాక గణపతి,సోనేరావు,ప్రధాన్ పురోహిత్ నాయకులు పెందోర్ ధర్ము,గేడం దాసు,కార్వేత తుకారాం,వసంత్ రావు,కోలాం సంఘం నాయకులు ఆత్రం మారు పటేల్,నాయకపోడ్ సంఘం భీమయ్య,నిర్వహణ కమిటి నాయకులు దేవు, మాజీ సర్పంచ్ నానేశ్వర్,అడ తాను,జుగాది రావు,మహిళలు,ఆయా సంఘాల నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# బాస్కెట్ బాల్ పోటీలో జోనల్ స్థాయికి ఎన్నికైన విద్యార్థినిలు



సారంగాపూర్, అక్టోబర్ 19, ప్రభాతవార్త

జాంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి అండర్ 14 బాస్కెట్ బాల్ పోటీలు జడ్పిహెచ్ఎస్ పిచర, లక్ష్మణ్‌చందా మండలం నందు నిర్వహించడం జరిగింది. ఆ పోటీలలో ఆర్. జగశ్రీ, ఆర్. వెన్నెల, కే.నందిని అండర్ 14 బాస్కెట్ బాల్ పోటీల్లో పాల్గొనడం జరిగింది. ఈ పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచి జోనల్ స్థాయికి ఎంపికయ్యారు. అందుకుగాను పాఠశాల పిఈటి సుస్మిత, పిడి సుప్రియలను కళాశాల ప్రిన్సిపల్ బి. సంగీత, ఇతర సిబ్బంది అభినందించారు.

## నూతన మద్యం టెండర్ల లక్కీడ్రా వాయిదా

ఆసిఫాబాద్, అక్టోబర్ 19, ప్రభాతవార్త

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 32 మద్యం దుకాణాల కొరకు ధరఖాస్తు చేసుకొనే గడువు ముగిసిన నేపథ్యంలో ఈనెల 23న జరగాల్సిన లక్కీ డ్రాను వాయిదా వేస్తున్నట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్ ఆదివారం తెలిపారు. అనివార్య కారణాలతో నూతన మద్యం దుకాణాల టెండర్ల లక్కీ డ్రాను ఈనెల 27కు వాయిదా వేశామన్నారు. ఈ లక్కీ డ్రాను సోమవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు తెలిపారు. నూతన మద్యం దుకాణాలకు ఈనెల 18న గడువు తేదీ ఉండగా ఇప్పుడు ఈనెల 23 వరకు దరఖాస్తుదారులు మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దీనిని దరఖాస్తుదారులు గమనించి సహకరించాలని కోరారు. ఈ నెల 18 వరకు కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా 32 మద్యం దుకాణాలకు గాను 622 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. దీనికి గాను ప్రభుత్వంకు రూ. 18.66 కోట్ల రాబడి వచ్చిందన్నారు.



## హాస్టల్ వార్డెన్ ఆత్మహత్యాయత్నం

లక్షెట్టిపేట, అక్టోబర్ 19, ప్రభాతవార్త

లక్షెట్టిపేట పట్టణంలోని ఎస్సీ బాలుర పోస్టు మెట్రిక్ హాస్టల్ వార్డెన్ బాలసంకుల రాజగోపాల్ రావు శనివారం ఆత్మహత్యాయత్నం చేసారు. ఉన్నతాధికారుల వేధింపులు తట్టుకోలేక సాయంత్రం సుమారు 4 గంటలకు యాసిడ్ తాగినట్లు తెలిసింది. కుటుంబ సభ్యులు ఆయనను నిర్మల్‌లోని ఓ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. గతంలో ఆయన దండేపల్లి, దొనబండ వసతిగృహాల్లో కూడ ఇన్చార్జిగా పని చేసారు. ఉన్నతాధికారులు ఎందుకు వేధించారు? వేధించిన అధికారులు ఎవరు అనేది ఇంకా తెలియరాలేదు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి సీరియస్‌గానే ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

## బాణసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి

**- ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్**

ఆసిఫాబాద్, అక్టోబర్ 19, ప్రభాతవార్త

దీపావాళి పండగ సందర్భంగా బాణసంచా కాల్చే సమయంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదివారం జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ సూచించారు. దీపావళి ఆనందం, వెలుగుల పండుగను ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రజలందరికీ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులు, యువత తల్లిదండ్రుల పర్యవేక్షణలోనే బాణసంచా కాల్చాలని, పండుగ సందర్భంగా ప్రమాదకరమైన బాణసంచా వాడకూడదని సూచించారు. ప్రజల భద్రత కోసం జిల్లా వ్యాప్తంగా పోలీసులు విధులు చేపట్టనున్నారని తెలిపారు. దీపావళి సందర్భంగా శాంతి, సౌహార్ద్ర వాతావరణం నెలకొనాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు.

